సాక్షి నిర్మల్

శనివారం : 17 : ఫిబ్రవరి : 2024



ఐదేళ్లుగా సమావేశాల్లేవ్!

ఆదివాసీ, గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలో మూడు నెలల కోసారి నిర్వహించాల్సిన సమావేశాలు ఐదేళ్లుగా నిర్వహించడం లేదు. IIలో▸

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

నిర్మల్‌టౌన్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుమంటామని తెలిపారు. సోషల్ మీడియాపై పోలీసుల నిఘా ఉటుందని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /20.1

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. మధ్యాహ్నం వేడిగా, తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, ఆంగ్ల భాష్య నైపుణ్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.అక్షయను పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలో గైడ్ టీచర్‌గా శ్రీలత వ్యవహరించగా, మంగళవారం జరిగిన పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా మెమొంటోతోపాటు ప్రశంసాపత్రం అందించారు. పాఠశాలలో హెచ్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించడంతోపాటు ఘనంగా సన్మానించారు.

తెలంగాణ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా స్వామి



కొమ్మోజి స్వామి

లక్ష్మణచాంద: తెలంగాణ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కొమ్మోజీ స్వామి నియమితులయ్యారు. కళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. స్వామి మాట్లాడుతూ జిల్లాలో వెనకబడిన కళాకారుల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నకిరేకంటి కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు హాల్ టికెట్లు విడుదల

నిర్మల్ రూరల్: టైలరింగ్, డ్రాయింగ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల హాల్ టికెట్లు ప్రభుత్వం విడుదల చేసిందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు www. bse. telangana. gov. in వెబ్ సైట్‌లో ఈనెల 15వ తేదీ నుంచి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు (నాలుగు రోజులు) జరుగుతాయని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు ఈనెల 25న, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షలు ఈనెల 26, 27 తేదీల్లో జరుగుతాయని వివరించారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

కుభీర్: మండల కేంద్రంలో గురువారం రాత్రి సేవాలాల్ జయంతి సందర్భంగా తీసిన ర్యాలీపై కొందరు దాడిచేసి గిరిజనుడైన అవినాష్‌ను గాయపర్చిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు, హిందూ సంస్థల నాయకులు కార్యకర్తలు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ఎం.సోముకు వినతి పత్రం ఇచ్చారు. దాడిలో పాల్గొన్న 40మందిపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో వారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచులు రాథోడ్ శంకర్, గోపీచంద్, గిరిజన నాయకులు గులాబ్, కంలేష్, ధర్మజాగరణ ప్రముఖ్ అభిషేక్, బీజేపీ నాయకులు గంగాధర్, లింబాద్రి ఉన్నారు.

'సమగ్రశిక్ష' ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలి

తానూరు: సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ కోరారు. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ఎస్టీయూ సంఘం గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉపాధ్యాయులకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. రాత్రింబవళ్లు పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలను ప్రభుత్వం మానవత కోణంలో ఆలోచించాలని కోరారు. గురుకుల పాఠశాలలో పనిచేసే కేర్ టేకర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారికి ఎంటీఎస్ అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు మైనొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీ(కీ)చకులు!

- జిల్లాలో మళ్లీ ఘటనలు..
- గురువుల తప్పుడు చేష్టలు
- బయటకు రానివ్వకుండా ముడుపులు
- గుట్టుగా వేరేచోటుకు డిప్యూటేషన్లు
- పరువు కోసం వెల్లడించని తల్లిదండ్రులు



నిర్మల్: 'పిల్లలూ జాగ్రత్త..! సమాజంలో అందరూ మంచోళ్లే ఉంటారనుకోవద్దు. తోడేళ్లలాంటి వాళ్లూ ఉంటారు. పైకి మంచివాళ్లలా నటిస్తూ.. నమ్మించి కాటేస్తారు. జాగ్రత్తగా ఉండాలి..'అంటూ తన పిల్లల్లాంటి విద్యార్థులకు చదువులతోపాటు మంచిచెడులు చెప్పాల్సిన గురువులే దారితప్పుతున్నారు. సభ్యత, సంస్కారాలు నేర్పాల్సిన వాళ్లే అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. తమ పిల్లల్లాంటి విద్యార్థులపై అకృత్యాలకు పాల్పడుతున్నారు. సమాజానికి టీచర్‌గా కనిపిస్తూ.. పిల్లలపాలిట కీచకుల్లా మారుతున్నారు. గత ఏడాది ఘటనలను మరువకముందే జిల్లాలో మళ్లీ ఇలాంటివి చోటుచేసుకోవడం తల్లిదండ్రులను కలవరపెడుతోంది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మనసులో ఉన్నా.. ఎక్కడ తమ పిల్లల పేర్లు బయటకు వస్తే పరువుపోతుందేమోనని తల్లిదండ్రులు బయటకు చెప్పడానికి వెనకాడుతున్నారు. ఇక ఇలాంటి ఘటనలపై వెంటనే చర్యలు చేపట్టాల్సిన అధికారులూ దోషులతో కుమ్మక్కవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇదే అలుసుగాకీచక టీచర్ల సంఖ్య పెరుగుతోంది.

విద్యార్థినులతో..

రెండు నెలల క్రితం కుభీర్ మండలంలోని ఓ ఉన్నతపాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు చేసిన కీచక చేష్టలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. తమ సార్.. అన్న భావనతో దగ్గరకు వచ్చే విద్యార్థినులతో అసాంఘికంగా ప్రవర్తించినట్లు తేలుస్తోంది. తాను చెప్పినట్లు వినని విద్యార్థినులతో ఆయన కక్షపూరితంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వివాహితుడైన సదరు వ్యాయామ ఉపాధ్యాయుడు 317 జీవోలో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది. ఇలా రావడం వెనుక ఓ విద్యాశాఖాధికారి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది కూడా కుభీర్ మండలాని చెందిన ఓ ఉపాధ్యాయుడు, తానూరు మండలానికి చెందిన మరో ఉపాధ్యాయుడిపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. విద్యార్థినులతో ఉపాధ్యాయులే అసభ్యంగా వ్యవహరించడంపై తల్లిదండ్రులు మండిపడుతోంది.

ముందే తెలుసా..!

రెండునెలల క్రితమే సదరు వ్యాయామ ఉపాధ్యాయుడు చేసిన కీచక చర్యలు విద్యాశాఖలో దాదాపు అందరికీ తెలుసని సమాచారం. ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవోతోపాటు డీఈఓ వరకు దీనిపై ముందే సమాచారం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కానీ.. ఎవరూ సదరు పీఈటీపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అకృత్యాలు బయటకు వచ్చిన తర్వాత సదరు పీఈటీ కొన్నిరోజులపాటు బడికి కూడా రాలేదన్న విషయం తెలుస్తోంది. నెలక్రితం కుభీర్ మండలంలోనే మరో గ్రామ ప్రాథమిక పాఠశాలకు సదరు పీఈటీని డిప్యూటేషన్‌పై పంపడం చూస్తుంటే.. విషయమంతా తెలిసే విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని సమాచారం. సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొదలు మండల, జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపైనా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ ఘటనపై పలువురు హైదరాబాద్ వరకు వెళ్లి ఫిర్యాదులు చేశారు. జిల్లాలో పైపై విచారణలు, సాదాసీదా చర్యలు తీసుకుని చేతులు దులిపేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు.

పరువు పోతుందని..

'సార్..అయిందేదో అయిపోయింది.. ఇలాంటివి బయటకు వస్తే తమ బిడ్డల పరువు పోతుంది..' అన్న ఆ తల్లిదండ్రుల బాధ, భయమే కీచకటీచర్లకు వరంగా మారుతోంది. ఇక్కడా ఇదేతీరు కనిపిస్తోంది. రెండునెలల క్రితం వ్యాయామ ఉపాధ్యాయుడు పాల్పడిన అకృత్యాలు బయటకు వచ్చినా.. ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రాకపోవడం దారుణం. అలాంటి టీచర్లు తమ గ్రామంలో ఉండొద్దన్న డిమాండ్‌ను మాత్రమే పెడుతున్నారు. 'ఇక్కడ మీ గ్రామంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారు.. మరో ఊళ్లో చేయరని గ్యారంటీ ఏంటీ..?' అన్న ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. ఎన్ని చట్టాలు వచ్చినా.. వాటిపై మహిళలు, విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడమూ కీచకులకు కలిసివస్తోందన వాదన ఉంది.



ఫిర్యాదుతో శీతల్కర్ అరవింద్

వ్యాయామ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

నిర్మల్ రూరల్: కుభీర్ మండలం పల్సీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాదులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఛాత్ర యువ సంఘర్షణ సమితి జిల్లా వర్కింగ్ అధ్యక్షులు శీతల్కర్ అరవింద్ మాట్లాడుతూ... రెండేళ్లుగా సదరు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికే డీఈవో కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. కానీ ఎలాంటి ఫలితం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి సదరు ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకుంటాం..

కుభీర్ మండలంలోని ఓ ఉన్నతపాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడి తీరుపై ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే ఆయనను వేరే పాఠశాలకు పంపించాం. ప్రస్తుతం ఈ ఫిర్యాదులపై విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తయిన తర్వాత చట్టపరమైన చర్యలను తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ధనరాజ్

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలని, సాధారణ ప్రసవాలు పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజు సూచించారు. జిల్లా కార్యాలయంలో ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, గైనకాలజిస్టులతో సిజేరియన్ ప్రసవాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కొంత కాలంగా సిజేరియన్ ప్రసవాలను తగ్గించాలని సూచిస్తున్నా ఆశించిన స్పందన రావడంలేదన్నారు. ఇకపై సిజేరియన్లను తగ్గించని వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. గర్భధారణ సమయం నుంచి స్త్రీలకు సాధారణ ప్రసవాల గురించి కౌన్సెలింగ్ నిర్వహించి, సాధారణ ప్రసవాలవైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రుల యాజమాన్యాలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులు నిర్వహించడం నేరమన్నారు. సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నయనరెడ్డి, ఎంహెచ్ఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, నిర్మల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్టులు, డాక్టర్లు పాల్గొన్నారు.

20న బాసర నుంచి బీజేపీ యాత్ర

- బాసరలో సన్నాహక సమావేశం

భైంసా: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈనెల 20న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాసర నుంచి బస్సుయాత్ర ప్రారంభించనున్నట్లు యాత్ర కన్వీనర్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బాసరలో శుక్రవారం మాట్లాడారు. బస్సుయాత్రలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని కోరారు. జిల్లా ప్రజలు ఇందులో భాగమయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామరాజేశ్వరరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవర్ సాయినాథ్, పుట్నల సాయినాథ్‌పటేల్, కౌన్సిలర్ గాలి రవి, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వెల్మల మధు

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు, యువత విప్లవాత్మక మార్పులకనుగుణంగా శాస్త్రసాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకోవాలని ప్రముఖ వృక్షశాస్త్ర నిపుణులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్మల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆర్డీఎన్ఏ – సాంకేతికత' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులతో విస్తృతోపన్యాసం, చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవ సాంకేతిక శాస్త్రం సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. ఆధునాతన సమాజ మార్పులకు సిద్ధంకావాలని సూచించారు. మానవాళికి జీవ సాంకేతిక అభివృద్ధి మరింత జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత రానున్న కాలంలో జీవ సాంకేతిక శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జన్యు మార్పిడి, మొక్కలు, జంతువులతో నిత్యజీవితంలో మానవాళి మనుగడ కోసం సమన్వయం చేసుకోవాల్సిన తీరును వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జె.భీమారావు, అధ్యాపకులు పవన్‌కుమార్, నరేందర్, అరుణ్‌కుమార్, రంజిత్, పీజీ.రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌కు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం నాయకుడు రాజన్న

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ ఎంసీ.లింగన్న డిమాండ్ చేశారు. రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్, బుధవార్‌పేట్, గాంధీచౌక్ , పాత మార్కెట్ మీదుగా శివాజీ చౌక్ వరకు కొనసాగింది. అనంతరం మానవహారం పాటించారు. ఈ సందర్భంగా ఎంసీ.లింగన్న మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రైల్వేలైన్ తీసుకొస్తామని బాండ్ రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులకు, యజమాన్యానికి, విద్యార్థి సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, రైల్వే సాధన కమిటీ కన్వీనర్ మనోజ్‌యాదవ్, సభ్యులు సాయన్న, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు



ధర్నాలో నినదిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేదంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. అంతకుముందు స్థానిక గాంధీ పార్క్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వామపక్షాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను సవరించారని మండిపడ్డారు. రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విమానయానం, మైనింగ్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు అమ్మేసి దేశ సంపదను కొల్లగొట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన కోడ్‌లను రద్దుచేసి ప్రతీ కార్మికుడికి నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ.800 ఇచ్చి, పనులు జరిగే స్థలంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొమ్మెన సురేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎన్.రెడ్డి, వామపక్షాల నాయకులు కట్ల రాజన్న, హరిత, రాజేశ్, మోహన్, దుర్గం నూతన్‌కుమార్, విజయ్ కుమార్, లక్ష్మి, నవీన్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఉపాధ్యాయుల సంఘీభావం

ఖానాపూర్: కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ తెలిపారు. సుర్జాపూర్ పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పీఎఫ్ ఆర్డీఏ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

నేడు ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

నిర్మల్ రూరల్: స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్నయాదవ్, జె.లక్ష్మణ్ తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానంద్‌గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

పేదింట్లో గృహ'జ్యోతి' వెలిగేలా..

- కొనసాగుతున్న వివరాల నమోదు
- ఈనెల 18 వరకు తుదిగడువు
- 200 యూనిట్లలోపు వినియోగించే వారికి పూర్తిగా ఉచితం
- తెల్ల రేషన్‌కార్డే ప్రామాణికం..

జిల్లాల వారీగా గృహవినియోగ కనెక్షన్ల వివరాలు..

నిర్మల్	1,91,904
ఆదిలాబాద్	1,68,034
మంచిర్యాల	2,25,719
కుమరంభీమ్	1,30,260



గృహజ్యోతి కోసం వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది..

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి అమలుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీనిని అమలు చేసేందుకు ఇప్పుడు కసరత్తు చేస్తోంది. జిల్లాలో విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు వివరాలు సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం గృహజ్యోతి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఈనెల 18 వరకు సర్వేను పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు శ్రమిస్తున్నారు.

తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే..

ప్రతీనెల విద్యుత్ మీటరు రీడింగ్ కోసం వచ్చే సిబ్బంది వినియోగదారుల ఆహార భద్రత కార్డు, ఆధార్ నంబర్, మొబైల్ నంబరు సేకరించి విద్యుత్ సర్వీస్ నబరుకు అనుసంధానం చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికే గృహజ్యోతి అమలు కానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో తెల్లరేషన్ కార్డుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది మధ్యతరగతి వారికి తెల్ల రేషన్ కార్డులు లేవు. అయితే వారి గృహజ్యోతి అమలు ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అద్దెకు ఉంటున్న కుటుంబాలకు..

ఉద్యోగం, ఉపాధి నిమిత్తం సొంత ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాల్లో అద్దెకుంటున్న వారికి కూడా ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు. ఈ మేరకు మీటర్ ఎవరి పేరిట ఉన్నా ఆ ఇంట్లో ఉన్న వారి వివరాలను తెల్లరేషన్ కార్డు ద్వారా అనుసంధానం చేస్తే సరిపోతుందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ఎన్‌పీడీసీఎల్ అధికారుల ఆదేశాల ప్రకారం వివరాల సేకరణ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. విద్యుత్‌శాఖ డీఈలు, ఏఈలు బిల్లింగ్ సిబ్బందికి ఇప్పటికే సమావేశాలు నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. అద్దెకుంటున్న వారి కుటుంబాల వివరాలను సైతం సేకరించాలని సూచించారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో 1,91,904 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇప్పటికే 70శాతం పైగా వివరాలను నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెల 18 వరకు వివరాలు సేకరించనున్నట్లు పేర్కొంటున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు 'గృహ జ్యోతి'కి అర్హులని, విద్యుత్ శాఖ ఇచ్చిన యాప్‌ద్వారా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు నంబర్లతోపాటు విద్యుత్ మీటరు, మొబైల్, ప్రజాపాలన రసీదు నంబర్లను నమోదు చేస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు కచ్చితంగా ఉంటేనే గృహజ్యోతి పథకానికి అర్హులని తెలుస్తోంది.

18 వరకు వివరాల సేకరణ..



రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గృహ జ్యోతి పథకం వినియోగదారుల కోసం అర్హులైన వారి వివరాల సేకరణ కొనసాగుతోంది. జిల్లాలో దాదాపు 1.90 లక్షలకుపైగా గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా, ఇప్పటికే వివరాల సేకరణ పూర్తి కావస్తోంది. ఈనెల 18 వరకు వందశాతం వివరాల సేకరణ పూర్తిచేస్తాం. మా సిబ్బంది ఇంటింటికీ వచ్చి వివరాల సేకరణ చేస్తున్నారు. వారికి వివరాలు అందిస్తే నమోదు చేసుకుంటారు.

– జయవంత్ రావు చౌహాన్, ఎస్ఈ, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

సమస్యలపై చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: బీజేఎల్పీనేతగా ఎన్నికైన తర్వాత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో మరింత దూకుడు పెంచారు. బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో భాగంగా శుక్రవారం ఆయన వివిధ అంశాలను లేవనెత్తారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన నిరుద్యోగ హామీ, ఎస్సీ వర్గీకరణ, దళితుల అభ్యున్నతిపై సర్కారుతీరును ఎండగట్టారు. ప్రజాసమస్యలపై చర్చించడానికి ఇంకో 40 రోజులైనా బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. అధికార పార్టీ తమకు అనుకూలంగా సభాసమయాలు మార్చడం సరికాదన్నారు.

సిరిసిల్లకు దీటుగా ఖానాపూర్ అభివృద్ధి



అసెంబ్లీలో మాట్లాడుతున్న బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గాన్ని సిరిసిల్ల దీటుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం అసెంబ్లీ జీరో అవర్‌లో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయడంతోపాటు సదర్మాట్ ప్రత్యేక కాలువ, డిగ్రీ కళాశాల వంటి ఎన్నో హామీలను ఇచ్చి తొమ్మిదిన్నరేళ్లలో నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు ప్రభుత్వం దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కరిస్తానని మంత్రి కోమటిరెడ్డి సమాధానం ఇచ్చారు. రెవెన్యూ డివిజన్ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

11 కేవీ తెగిపడి ఆవు మృతి



ఆవు కళేబరం

జైనథ్: మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన ఈగం విలాస్ చేనులో 11కేవీ తీగలు తెగిపడటంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... నుగూర్ గజానన్‌కు చెందిన ఆవు శుక్రవారం విలాస్ చేన్‌లో మేతకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడటంతో అక్కడికక్కడే ఆవు మృతి చెందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు, పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. దీంతో రూ.50వేల విలువ చేసే ఆవు చనిపోవడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నూతన కార్యవర్గం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న 87 కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల అధికారి డాక్టర్ దేవరాజ్ ప్రకటించారు. అన్ని అధికారిక పోస్టులకు ఎవరు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా కేటాయించినట్లు దేవరాజు తెలిపారు. అధ్యక్షుడిగా బత్తిన ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా స్వప్నిల్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ దత్తు, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ అజయ్, కోశాధికారిగా డాక్టర్ రాజేందర్, పీఆర్‌ఓగా సనకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంక్షేమం, జీతాల పెంపు, ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు ఉపేందర్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య



దేవేందర్ మృతదేహం

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందినపాలెపు దేవేందర్(36) శుక్రవారం వేకువ జామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హన్మాండ్లు వివరాలు ప్రకారం.. దేవేందర్‌కు గత పది సంవత్సరాల క్రితం చాక్‌పల్లి గ్రామానికి చెందిన కవితతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు జన్మించింది. మద్యానికి అలవాటు కావడంతో కుటుంబంలో కలహాలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. హన్మాన్ మాల ధరించిన దేవేందర్ రాత్రి ఒంటిగంట ప్రాంతంలో సన్నిధానం నుంచి బయలు దేరి కల్లూర్ వాగు సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి పోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది... సిరికొండ మండలంలోని బుర్థిగుట్ట, ధర్మన్నపేట్ కొలాంగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డు. దారి అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాలకు గిరిజనులు వెళ్లలేని పరిస్థితి. ఈ గ్రామంలో అధికంగా కొలాం గిరిజనులు నివాసం ఉంటున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామాలకు 108 వంటి వాహనాలు సైతం రాకపోవడంతో పలువురు ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిరికొండ మండలంలోని బుర్థిగుట్ట గ్రామం ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేదు. ఈ గ్రామంలో దాదాపు 20 కుటుంబాలకు పైనే కొలాం గిరిజనులు నివాసం ఉంటున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంధకారంలో కాలం గడుపుతున్నారు. ఐటీడీఏ అధికారులు సోలార్ ఏర్పాటు చేసినా ఫలితం లేదు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని బుర్థిగుట్ట గ్రామస్తులు కోరుతున్నారు.





నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గొందుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గుక్కెడు నీటి కోసం కిలో మీటరు దూరం కాలినడకన వెళ్లి బిందెడు నీటిని తీచ్చుకుంటున్నారు. ఈ గ్రామస్తులకు కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చినా ఫలితం లేదు. పాలకులు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ గిరిజనుల దరిచేరడం లేదు.

ఐదేళ్లుగా సమావేశాల్లేవ్..!

- నిర్వహించని ఐటీడీఏ పాలకవర్గ సమావేశం
- కుంటుపడుతున్న గిరిజన అభివృద్ధి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాల తీరు...

సమావేశమైన తేదీ	ప్రాజెక్టు అధికారి
17 జూన్ 2010	సుజాతశర్మ
13 సెప్టెంబర్ 2013	జనార్దన్ నివాస్
19 ఫిబ్రవరి 2015	శ్రీనివాస్
27 మే 2015	ఆర్వీకర్ణన్
07 ఏప్రిల్ 2016	ఆర్వీకర్ణన్
31 జూలై 2016	ఆర్వీకర్ణన్
30 అక్టోబర్ 2019	కృష్ణఆదిత్య



ఐటీడీఏ కార్యాలయం

నార్నూర్: అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని ఉందనే చందంగా మారింది గిరిజనుల పరిస్థితి. వారి సమగ్రాభివృద్ధి కోసమని ఏర్పాటు చేసిన ఐటీడీఏలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన సమావేశాలు ఐదేళ్లుగా నిర్వహించడం లేదు. గిరిజనుల సంక్షేమం కోసం పనులు చేపట్టే ఐటీడీఏ పాలకవర్గం సమావేశ నిర్వహణపై ఉన్నత అధికారులు ఇటు పాలకవర్గం పట్టించుకోకపోవడం గమనార్హం. చివరిసారిగా సమావేశం జరిగి ఐదేళ్లు దాటిపోయినా ఇప్పటికీ నిర్వహించకపోవడం పాలకవర్గం పనితీరుకు నిదర్శనం. సమావేశాలు ఐదేళ్లు దాటిన నిర్వహించకపోవడంతో గిరిజన అభివృద్ధి కుంటుపడుతోంది.

గిరి పల్లెల్లో సమస్యలు అనేకం..

నేటికీ పలు ఆదివాసీ గూడెల్లో తాగునీటి కోసం ఇక్కట్లు తప్పడం లేదు. మిషన్ భగీరథ వంటి పథకాలు ఎన్ని ఉన్నప్పటికీ తండాల్లో నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ మండలాలైన నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, కొమురంభీం జిల్లా జైనూర్, సిర్పూర్‌యు, లింగాపూర్ వంటి మండలాల్లో ఇప్పటికీ తాగునీటి కోసం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఏజెన్సీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఏడాది క్రితం ప్రారంభించిన సీహెచ్‌సీ (30 పడకల ఆస్పత్రి)లో వైద్యుల కొరత వెంటాడుతోంది. అత్యవసర సమయాల్లో కిందిస్థాయి సిబ్బంది దాదాపు 30 నుంచి 40కిలో మీటర్ల దూరంలోని ఉట్నూర్‌లోని జిల్లా ఆస్పత్రికి లేదా రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు లేక అంధకారంలో ఉన్నాయి.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తాం



గత ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో మాట్లాడి త్వరలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించడానికి తన వంతు కృషి చేస్తా. ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పథకం గిరిజనుల చెంతకు చేరేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఏజెన్సీ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్తాను.

– వెడ్మ భొజ్జు, ఎమ్మెల్యే ఖానాపూర్

నిర్ణయం తీసుకుంటాం



ఐటీడీఏ ద్వారా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై మొదటి ప్రాధాన్యత ఇవ్వడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ప్రభుత్వ పథకం ఆదివాసీ గిరిజనులకు చేరేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. పాలకవర్గ సమావేశంపై అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.. గిరిజనుల విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– ఖుష్బూగుప్తా, ఐటీడీఏ పీవో, ఉట్నూర్

అభివృద్ధి కుంటుపడుతోంది..



ఐటీడీఏ పాలకమండలి సమావేశాన్ని ప్రతీ మూడు నెలలకు ఓసారి నిర్వహించాలి. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలి. 80ఏళ్ల నుంచి ఆదివాసీలు కష్టాలు పడుతూనే ఉన్నారు. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలతో సతమతమవుతున్నారు. కిలో మీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. రోడ్డు సౌకర్యం లేక సరైనా సమయాల్లో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

– దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

మూడు నెలలకోసారి నిర్వహించాలి



ప్రతీ మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తేనే గిరిజనుల సమస్యలపై చర్చ జరుగుతుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వమైనా పాలకవర్గ సమస్యలపై దృష్టి సారిస్తే బాగుంటుంది. పీవోగా బాధ్యతలు తీసుకున్న ఖుష్బూగుప్తా సమావేశ నిర్వహణపై దృష్టి సారించాలి.

– ఆత్రం సుగుణ, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు

హత్య కేసులో నలుగురికి జైలు

ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ: ఇద్దరు వ్యక్తులను హత్య చేసిన కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2021 అక్టోబర్ 27న ఉదయం 10గంటలకు ఇచ్చోడ మండలంలోని గుండాలలో ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా డీజే సిస్టమ్ ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. దీంతో ఇచ్చోడ పోలీసులు డీజే సిస్టమ్ సీజ్ చేసి తీసుకెళ్తుండగా గ్రామస్తులు అబ్దుల్ రషీద్ తన అనుచర వర్గం అదే గ్రామానికి చెందిన మోబిన్ వర్గం పోలీసులకు చెప్పి ఉంటారనే అనుమానంతో గొడవకు దిగారు. రాళ్లు, గొడ్డళ్లు, కర్రలతో మోబిన్ వర్గంపై దాడి చేశారు. పారిపోతున్న వ్యక్తులను వెంబడించారు. సిరాజ్ తలపై దాడి చేసి ఆయన బంధువులు షేక్ జహీరొద్దీన్, షేక్ జాహ అనే వ్యక్తులను గొడ్డలితో నరికి చంపారు. దీంతో ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో అబ్దుల్ రషీద్, షేక్ రఫీక్, షేక్ రబ్బాన్, షేక్ షకీల్‌లపై కేసు నమోదైంది. పీపీ 17 మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు పై విధంగా జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

నూతన నియామకం

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆ శాఖ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ టి.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హరికిషన్, సాయి కృష్ణలతో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను అందజేయడంతో పాటు పూలబొకేలను అందజేసి అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జి. శ్రీనివాస్, జి.ప్రభాకర్ వ్యవహరించారు.

ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ సమీపంలోని కాకతీయ పాఠశాల వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడకు చెందిన వృద్ధుడు గంగారం రోడ్డు దాటే క్రమంలో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కొనసాగుతున్న నాగోబా జాతర



నాగోబా దర్శనానికి క్యూలో భక్తులు



కేస్లాపూర్‌కు బయలుదేరిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 9న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. అధికారికంగా నాగోబా జాతర ముగిసినప్పటికీ అనాధికారికంగా శుక్రవారం కూడా భక్తులు తరలివచ్చి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇంటికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా స్థానిక ఎస్సై దుబ్బక సునీల్ పర్యవేక్షణ చేశారు.

కేస్లాపూర్‌కు మెస్రం వంశీయులు

నాగోబా ఆలయంలో మహా పూజ నిర్వహించిన మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ బుడుందేబ్ ఆలయంలో జాతరను ప్రారంభించి శుక్రవారం తిరిగి కేస్లాపూర్ చేరుకున్నారు. మెస్రం వంశీయులు వారి గ్రామాలకు వెళ్లినట్లు పటేల్ మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. పవిత్ర గంగాజలం సేకరించిన ఝూరి దేవతను, పూజ సామగ్రిని కేస్లాపూర్ నాగోబా మురాడి వద్ద భద్రపరిచారు. మెస్రం వంశం పెద్దలు బాదిరావ్ పటేల్, చిన్ను పటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం దాదారావ్, హనుమంత్‌రావ్, లింబారావ్ ఉన్నారు.

15 ఏళ్ల వధువు.. 33 ఏళ్ల వరుడు!

- ఏడాది తర్వాత వెలుగులోకి బాల్య వివాహం..
- కోరుట్ల బాలికతో.. ఆదిలాబాద్ జిల్లా బేల అబ్బాయికి పెళ్లి
- బేల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- బాలసదన్‌లో బాలిక

ఆదిలాబాద్‌టౌన్: తొమ్మిదో తరగతి చదువుతున్న 15ఏళ్ల బాలికకు కుటుంబీకులు, మధ్యవర్తులు కలిసి 33 ఏళ్ల వ్యక్తితో బాల్య వివాహం జరిపించారు. విషయం ఏడాది తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికను భర్త వేధింపులకు గురిచేయడంతో ఆమె తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. విషయం ఆనోటా.. ఈనోటా బయట పడడంతో పాఠశాలలో జగిత్యాల జిల్లా బాలల కమిషన్ విద్యార్థి వివరాలు సేకరించింది. జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో జిల్లా అధికారులు బేలలోని ఆమె అత్తారింటికి వెళ్లి బాధితురాలిని తీసుకొచ్చారు. జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో ఉంచారు. బేల పోలీసుస్టేషన్‌లో బాల్య వివాహం కేసు నమోదైంది.

ఏడాది క్రితం..

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన 15 ఏళ్ల బాలికకు గత మార్చిలో తల్లిదండ్రులతో పాటు మధ్యవర్తులు బాల్య వివాహం జరిపించారు. 9వ తరగతి వార్షిక పరీక్షలు ముగిసిన వెంటనే ఈ పెళ్లి జరిగింది. అయితే మధ్యవర్తులు బేలకు చెందిన పెళ్లి కొడుకు (33 ఏళ్ల వ్యక్తి) కుటుంబీకుల నుంచి డబ్బులు తీసుకొని పెళ్లి జరిపించినట్లు పలువురు చెబుతున్నారు. బాలిక తల్లి పాచిపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా, తండ్రి దివ్యాంగుడు. ముంబాయ్‌లో ఉంటున్నాడు. పెళ్లయిన తర్వాత నుంచి ఒకట్రెండు సార్లు మాత్రమే బాలిక పుట్టింటికి వచ్చింది. కాగా పెళ్లి కొడుకు కుటుంబీకుల నుంచి మధ్యవర్తులు డబ్బులు తీసుకొని వాటిలో నుంచి ఆ బాలికకు సెల్‌ఫోన్ కొనిచ్చారు. కొంత డబ్బులు ఆమె కుటుంబీకులకు ఇచ్చినట్లు సమాచారం. బాలిక భర్త గొడవలు, వేధింపులకు పాల్పడేవారని ఆమె తల్లి పేర్కొంది.

15 రోజులుగా బాలసదన్‌లో..

బాల్య వివాహం జరిగిందనే సమాచారం అందడంతో బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు బేలకు చేరుకొని బాధిత బాలికను జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు 15 రోజుల క్రితం తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆమె ఇక్కడే ఉంటుంది. ఆమెకు ఛాతినొప్పితో పాటు పచ్చకామెర్లు వచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. అయితే పలుసార్లు బాలసదన్ సిబ్బంది ఆమెను రిమ్స్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఆమె అక్కడ ఉండనంటూ పుట్టింటికి వెళ్తానంటూ కన్నీరుమున్నీరవుతోంది. ఈ విషయమై ఐసీపీఎస్ అధికారి ప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. పక్షం రోజుల క్రితం విషయం తెలియడంతో బాలికను బాలసదన్‌కు తీసుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కుటుంబీకులపై బేల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. బేల ఎస్సైని వివరణ కోరగా, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని, పోక్సో యాక్ట్‌కు సంబంధించి లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నామని తెలిపారు. ఇరు కుటుంబీకులతో పాటు పెళ్లికి హాజరైన వారిపై సైతం కేసులు నమోదు చేయనున్నట్లు వివరించారు.

అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు

- ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీ సోయం బాపూరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అహేతుక ఆరోపణలు చేస్తే సహించేది లేదని, మాజీ ఎంపీ మీడియా చిట్‌చాట్‌లో తాను కాంగ్రెస్‌లో చేరేందుకు ట్రై చేస్తున్నానని ఆరోపించడం సరికాదని, పార్టీలు మారడం రాథోడ్ రమేష్‌కే అలవాటు ఉందని, స్వార్థం కోసం ఇతరులపై నిందలు వేయడం సరికాదని, తనకు టికెట్టు వచ్చినా, రాకపోయినా బీజేపీలో చివరి రక్తపు బొట్టు వరకు ఉంటానని చెప్పారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీకి సంబంధించి కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైంది. సర్వీసులో మరణించిన ఉద్యోగులు, కార్మికులు, అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని వారి స్థానాల్లో వారి కుటుంబీకులకు ఉద్యోగాలు ఇవ్వాలని సంస్థ నిర్ణయం మేరకు రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లో కారుణ్య ప్రక్రియ ప్రారంభించారు. ఉద్యోగులకు, కార్మికులకు సంబంధించి వారి కుటుంబీకులు ప్రక్రియకు హాజరయ్యారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ప్రవీణ్ కుమార్, ప్రణీత్ కుమార్ ధ్రువపత్రాలను పరిశీలించారు. దరఖాస్తులు, మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణ అనంతరం నియామక పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఆలయంలో దొంగతనం



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

ముధోల్: మండల కేంద్రంలోని పురాతన జలశంకర ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల ప్రకారం... గురువారం రాత్రి ఆలయ పూజారి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూడగా ఆలయం తెరిచి ఉండగా లోపలికి వెళ్లి చూడగా హుండీ పగలగొట్టి కనిపించింది. వెంటనే విషయాన్ని గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ముధోల్ ఎస్సై సాయికిరణ్ ఆలయానికి చేరుకొని పగిలిన హుండీని పరిశీలించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కేళాపూర్‌కు చెందిన కంచంవార్ అన్నపూర్ణ అనే మహిళ మెడలో నుంచి శుక్రవారం బంగారు గొలుసు చోరీకి దుండగుడు విఫలయత్నం చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఆ మహిళ తన తండ్రి తులసీరాం ఆరోగ్యం బాగలేకపోవడంతో ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చింది. తిరుగు ప్రయాణంలో ఠాకూర్ హోటల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాగాడు. పక్కనే ఉన్న ఆమె తండ్రి నిందితుడిని పట్టుకున్నాడు. దీంతో అందరు అక్కడ గుమ్మిగూడగా నిందితుడు గొలుసు పడేసి అక్కడి నుంచి పారిపోయాడు. కాగా ఆ వ్యక్తిని ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన రోహిత్‌గా గుర్తించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఏడు తులాల బంగారం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని హమీద్‌పూరకు చెందిన నరేందర్ రెడ్డి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నరేందర్‌రెడ్డి భార్యతో కలిసి తమ్ముడి ఇంటికి రాత్రి 9గంటల ప్రాంతంలో వెళ్లాడు. తిరిగి 10 గంటలకు ఇంటికి చేరుకోగా తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువాలోని ఏడు తులాల 8గ్రాముల బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా ఏఎస్సై దైవశాల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మభవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

- చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహం ఆవిష్కరిస్తున్న రాంచంద్రయ్య

లోకేశ్వరం: హైదరాబాద్‌లో రజక సంఘం ఆత్మభవన నిర్మాణానికి మూడు ఎకరాల భూమిని కేటాయించాలని తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ మనుమడు రాంచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ మనుమడు రాంచంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రజాకార్ల దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాడి కమ్యూనిస్టుల స్ఫూర్తితో బానిసల బతుకుల విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో రజకులు బానిసలుగా కాకుండా రాజకీయంగా చైతన్యవంతులై రాజ్యాధికారాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ రజక సంఘం సమన్వయ కమిటీ ఛైర్మన్ బసవరాజ్ శంకర్ మాట్లాడుతూ రజక కులస్తులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలని కోరారు. ఐలమ్మ మునిమనుమడు సంపత్, రాష్ట్ర రజక సంఘం పోశెట్టి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆత్రం సుగుణ, ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్, మండల అధ్యక్షుడు భూమన్న, వీడీసీ ఛైర్మన్ శ్రీనివాస్, కుమ్మరి విఠల్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ఘనంగా సేవాలాల్ జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్

భైంసా: బంజారాల ఆరాధ్యుడు సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్, మేరామా యాడి చిత్రపటాలకు పూలమాల పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డైరెక్టర్ మాట్లాడారు. గిరిజనుల ఉద్ధరణ కోసం సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. అనంతరం భోగ్ బండార్ నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ మహేశ్, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ విఠల్, కోకన్వీనర్ వసంతబాబు ఉన్నారు.